ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

కర్నూలు

జిల్లా వార్తలు

శుక్రవారం 21 జూన్ 2024








యోగా అంటే ఏమిటి ..?

యుజ్ అనగా కలయిక అనే ధాతువు నుంచి యోగ లేదా యోగం అనే పదం ఉత్పన్నమైంది. ఇంద్రియాలను వశపరుచుకుని మనసును లగ్నం చేయడం యోగాలో కీలకం. ఇతర వ్యాయామాల కంటే పూర్తిగా భిన్నమైనది యోగాభ్యాసం. దీనిలో నిబిడీకృతంగా ఉన్న ఆధ్యాత్మిక భావం కారణంగా దేశవిదేశాల్లో విశేష ప్రాచుర్యాన్ని సంతరించుకుంది. మానసిక ఏకాగ్రత వల్ల మానసిక ప్రశాంతతను అందిస్తుంది. తద్వారా మానసిక, శారీరక ఆరోగ్యానికి దోహపడుతోంది.

ఆరోగ్య యోగం


- యోగాతో సంపూర్ణ ఆరోగ్యం
- నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం
- కర్నూలు ఔట్‌డోర్ స్టేడియంలో యోగా ప్రదర్శన

కర్నూలు(హాస్పిటల్), జూన్ 20: ప్రాచీన భారతీయ సాంప్రదాయంలో యోగా అమూల్య మైనది. ఆధునిక జీవితంలోని ఒత్తిడిని అధిగమించేందుకు యోగా అత్యవసరం. శారీరక శ్రమ లేకపోవడం వల్ల నిద్రలేమి, మధుమేహం, రక్తపోటు, గుండె సమస్యలు, ఆస్తమా, గ్యాస్టిక్, థైరాయిడ్, కీళ్లనొప్పులు, స్థూలకాయం వంటి దీర్ఘకాలిక వ్యాధులు పెరిగిపోయాయి. వీటన్నిటికీ యోగా పరిష్కారం అనే భావన పెరిగింది. అన్ని వయసులవారు, అన్ని రంగాల్లో పని చేస్తున్నవారు యోగ సాధన చేస్తున్నారు. యోగాకు ఇటీవల ప్రపంచ గుర్తింపు వచ్చింది. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా శుక్రవారం యోగా డే వేడుకలు నిర్వహిస్తున్నారు. కర్నూలులోని ఔట్‌డోర్ స్టేడియంలో ఆయుష్ శాఖ, డీఎస్‌ఏ, కర్నూలు నగర పాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో యోగాసనాలు నిర్వహిస్తారు. యోగా, ధ్యానం ఆధ్యాత్మిక సాధనకు, మానసిక ఆరోగ్యానికి చక్కగా తోడ్పడుతోంది. హఠయోగంలో భాగమైన ఆసనాలు శరీరారోగ్యానికి తోడ్పడి దేహదారుఢ్యాన్ని, ముఖ ఛాయను ఇనుమడింపజేస్తాయి. భారత ప్రధాని నరేంద్రమోదీ చొరవతో 2015 జూన్ 21వ తేదిన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని తొలిసారిగా నిర్వహించారు. ఐక్యరాజ్యసమితి యోగా దినోత్సవం సందర్భంగా ఈ ఏడాది వ్యక్తిగత, సమాజ ఆరోగ్యం కోసం యోగా అనే నినాదాన్ని ఇచ్చింది.





45 నిమిషాలు సామూహిక యోగా ప్రదర్శన



10వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం కర్నూలు ఔట్‌డోర్ స్టేడియంలో 45 నిమిషాలు సామూహిక యోగా ప్రదర్శన ఉదయం 6 నుంచి 8.30 గంటల వరకు నిర్వహిస్తారు. విద్యార్థులు నిత్యం యోగాసనాలు చేయడం వల్ల ఏకాగ్రత పెరుగుతుంది.

- డా.కేవీఎన్ ప్రసాద్, మెడికల్ ఆఫీసర్, యోగా నేచురోపతి (ఆయుష్), హుసేనాపురం

మనస్సును నియంత్రించేది యోగా



మనస్సును, శరీరాన్ని నియంత్రించేది యోగా. యోగాతో శారీరక వ్యర్థ పదార్థాలు వైదొలుగుతాయి. కరోనాను ఎదుర్కొనేందుకు అప్పుడు బ్రీతింగ్ ఎక్సర్‌సైజ్‌గా ప్రాణాయామం ఎంతో ఉపయోగపడింది. 6 సంవత్సరాల నుంచి 65 సంవత్సరాల వయస్సు వున్న వారు యోగా చేయవచ్చు.

- డా. ద్వారం ప్రభాకర్ రెడ్డి, సీనియర్ మెడికల్ ఆఫీసర్, కర్నూలు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల

మానసిక ప్రశాంతత లభిస్తుంది



జిల్లాలో పతంజలి యోగా సమితి, భారత్ స్వాభిమాన్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచితంగా యోగా శిక్షణ యోగా శిక్షకులను తయారు చేస్తున్నాం. శ్రీశైలం దేవస్థానంలో జరిగే యోగాడే కార్యక్రమంలో పతంజలి యోగా సమితి ద్వారా పాల్గొంటారు.

- ఎస్‌వీ శివరాజ్, యోగా గురువు, జిల్లా అధ్యక్షుడు, పతంజలి యోగా సమితి, కర్నూలు



ఎకరాకు రూ.10 వేల పరిహారం ఇవ్వండి

కేంద్ర కరువు బృందానికి రైతుల విన్నపం



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి నిరంజన్

కోవెలకుంట్ల, జూన్ 20: ఎకరాకు రూ.10 వేల నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని కేంద్ర కరువు బృందానికి రైతులు విజ్ఞప్తి చేశారు. గురువారం కోవెలకుంట్ల మండలంలోని భీమునిపాడు గ్రామంలో చౌడేశ్వరి దేవి ఆలయ సమీపంలో రైతులతో కేంద్ర కరువు బృందం ముఖాముఖి కార్యక్రమం జరిగింది. జాయింట్ కలెక్టరు రాహుల్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. కేంద్ర కరువు బృందమైన ఐఏఎస్ అధికారులు డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎక్స్‌పెండేచర్ సహాయకులు చిన్మయ గాట్మెర్, సాగు నీరు, పారిశుధ్య శాఖ డిప్యూటీ సంచాలకులు అశిఫ్‌పాండే, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి అరవింద్‌కుమార్ సోనీ పాల్గొని రైతులతో చర్చించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పంట నష్ట పరిహారాన్ని ఎకరాకు రూ.4వేల నుంచి రూ.10వేలకు పెంచాలని కోరారు. అలాగే కరువు వల్ల శనగ, జొన్న పంటల దిగుబడి 75 శాతం వరకు తగ్గిపోయి ఉన్నందున సాగు చేసిన ప్రతి ఎకరాకు బీమా సదుపాయం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. పంట నష్టపరిహారాన్ని రెండు హెక్టార్ల నుంచి నాలుగు హెక్టార్ల వరకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ అగ్రికల్చర్ ఆఫీసరు మురళీక్రిష్ణ, కోవెలకుంట్ల, నందికొట్కూరు, ఆళ్లగడ్డ వ్యవసాయ సహాయ సంచాలకులు, వ్యవసాయాధికారులు, కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు, డాల్ ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త కోఆర్డినేటరు రామక్రిష్ణారావు పాల్గొన్నారు.

కరువు పరిస్థితిపై ఫొటో ఎగ్జిబిషన్

నంద్యాల (కల్చరల్): నంద్యాల జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని కరువు పరిస్థితిపై గురువారం ఫొటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ ఎగ్జిబిషన్‌ను జిల్లా కలెక్టర్ డా.కె. శ్రీనివాసులుతో సహా ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీం సభ్యులు డిపార్ట్మెంట్ ఆఫ్ ఎక్స్పెండేచర్ డైరెక్టర్ చిన్మయ పుండ్లిక్ రావు గాట్మేర్(ఐఏఎస్), తాగునీరు, పారిశుధ్య శాఖ డిప్యూటీ అడ్వైజర్(పీహెచ్‌ఈ) అషిస్‌పాండే, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సెక్రటరీ అరవిందకుమార్ సోనీ బృందం పరిశీలించింది. ఈ ఫొటో ఎగ్జిబిషన్‌లో దెబ్బతిన్న పంట పొలాలు, తాగునీటి ఎద్దడిపై సంబంధిత శాఖల అధికారులు ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను కేంద్ర కరువు బృందం సభ్యులు పరిశీలించారు. అనంతరం రబీలో కరువు పరిస్థితిపై సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు మాట్లాడుతూ 2023-24 రబీలో తీవ్రమైన కరువు పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. జిల్లాలో 58,011 మంది రైతులకు సంబంధించి 59,207 హెక్టార్లకు ఎన్‌డీఆర్‌ఎఫ్ నిబంధనల ప్రకారం 57.30 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీకి ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్‌టీం అధికారులు మాట్లాడుతూ నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి మురళీక్రిష్ణ పాల్గొన్నారు.



కరువు పరిస్థితిపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను గురించి వివరిస్తున్న కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు

లిఫ్టు ఇరిగేషన్ స్కీములు ఏర్పాటు చేయండి

- కేంద్ర కరువు బృందానికి రైతుల వినతి

ఉయ్యాలవాడ, జూన్ 20: లిఫ్టు ఇరిగేషన్ స్కీములు ఏర్పాటు చేసి ఆదుకోవాలని కేంద్ర కరువు బృందానికి రైతులు విన్నవించారు. గురువారం జిల్లాలోని మూడు మండలాల్లో పర్యటించింది. కోవెలకుంట్ల మండలంలోని భీమునిపాడు, దొర్నిపాడు మండల కేంద్రం, ఉయ్యాలవాడ మండలంలోని హరివరం గ్రామంలో టీం సభ్యులు చిన్మయ్ గాట్మేర్, ఆసిఫ్ పాండే, అరవింద్‌కుమార్ సోనీ పర్యటించి కరువు సమస్యల పరిష్కార మార్గాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ముందుగా పంట నష్టంపై తీసిన ఫొటోలను వారు పరిశీలించారు. అనంతరం రైతులతో ముఖాముఖి నిర్వహించారు. హరివరం గ్రామానికి చెందిన కర్రా ప్రసాద్‌రెడ్డి, పల్లె మహేశ్వరరెడ్డి, కూడాల నారాయణరెడ్డి మాట్లాడుతూ కుందూ నది నుంచి కెసీ కెనాల్‌కు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీము ఏర్పాటు చేస్తే వర్షాలు కురవనప్పుడు సాగునీరు మళ్లించుకోవచ్చని అన్నారు. అలాగే పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కేంద్ర బృందాన్ని వారు కోరారు.

- జిల్లాలోని 13 కరువు మండల్లాల్లో 38,791 హెక్టార్లలో పంట నష్టం జరిగినట్లు గుర్తించి కేంద్ర బృందానికి నివేదించామని జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీక్రిష్ణ తెలిపారు. దీనికి 37,809 మంది రైతులకు రూ. 37.75 కోట్లు అవసరం అవుతుందని కేంద్ర బృందానికి నివేదించారు. జిల్లా వ్యాప్తంగా జొన్న, కొర్ర, ఆముదము పంటల సాగు రైతులకు హెక్టారుకు రూ.8,500, మినుము, శనగ, పొగాకు, పచ్చపెసర, సోయాబీను, సన్‌ఫ్లవర్ సాగు రైతులకు హెక్టారుకు రూ.10 వేలు, మొక్కజొన్న రైతులకు రూ. 12,500, వరి సాగు రైతుకు హెక్టారుకు రూ.15 వేల చొప్పున పరిహారం అందనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి, ఆర్డీవో మల్లికార్జున, డీహెచ్‌వో నాగరాజు, ఏడీఏ సుధాకర్, డ్వామా పీడీ రామచంద్రారెడ్డి, డీఏహెచ్‌వో గోవిందనాయక్, డీడీ రామణయ్య, ఆయా మండలాల ఏవోలు రాజేంద్రకుమార్, సుధాకర్‌రెడ్డి, అబ్దుల్‌హక్, జ్యోతి, సునీత ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.
- **దొర్నిపాడు, జూన్ 20:** మండలంలోని వెలుగు కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో కేంద్ర బృందం సభ్యులు ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించి రైతులతో మాట్లాడారు. కరువు పరిస్థితులు ఏర్పడటానికి గల కారణాలను, కాలువకు నీటి లభ్యత, శనగ, జొన్న, మినుము తదితర పంటల దిగుబడిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతుల నుంచి వినతులను స్వీకరించారు.



కరువు సమస్యలను కేంద్ర బృందానికి వివరిస్తున్న రైతులు

గుజరాత్ తరహాలో పారిశ్రామిక అభివృద్ధి

రాష్ట్ర పరిశ్రమ, వాణిజ్య, ఆహార శుద్ధి మంత్రిగా టీజీ భరత్ బాధ్యతలు

కర్నూలు(అర్బన్), జూన్ 20: పారిశ్రామిక వృద్ధిలో అత్యుత్తమ స్థానాన్ని పొందిన గుజరాత్ రాష్ట్రం తరహాలో రాష్ట్ర పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధిపరుస్తామని రాష్ట్ర పారిశ్రామిక, వాణిజ్య, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. గురువారం వెలగపూడి సచివాలయంలోని రాష్ట్ర సచివాలయం 4వ బ్లాక్‌లో నూతనంగా మంత్రి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశ్రామికంగా రాష్ట్రాన్ని సమగ్రాభివృద్ధి పర్చేందుకు పటిష్టమైన ప్రణాళికతో వ్యూహాత్మకంగా ముందుకు అడుగులు వేస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న పారిశ్రామిక రాయితీలను వెంటనే విడుదల చేస్తామన్నారు. 2019-24 మధ్యకాలంలో జరిగిన ఎంవోయూలన్నీ రియలైజ్ అయ్యేవిధంగా ఆయా పరిశ్రమలన్నీ రాష్ట్రంలో స్థాపించే విధంగా చర్యలు చేపడతమన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం కర్నూల్లో హైకోర్టు బెంచ్ కూడా ఏర్పాటు చేస్తామన్నారు. తనను ఆశీర్వదించిన కర్నూలు ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. కర్నూల్లో ఇండస్ట్రియల్ జోన్‌లో పరిశ్రమలు ఏర్పాటు అయ్యేలా కృషి చేస్తానన్నారు. కర్నూలు కేంద్రంగా పని చేస్తున్న సంస్థలు ఎక్కడికి వెళ్లిపోవని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు.

- **వేద మంత్రాల మధ్య బాధ్యతలు :** గురువారం ఉదయం 9 గంటలకు వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర మంత్రిగా టీజీ భరత్ బాధ్యతలు స్వీకరించారు. సతీసమేతంగా రాష్ట్ర సచివాలయానికి విచ్చేసిన ఆయనకు వేద పండితులు పూర్ణకుంభంతో, అధికారులు పుష్పగుచ్ఛాలతో ఘనంగా స్వాగతం పలికారు. వేద పండితులు మంత్రాలు చదువుతుండగా ఆయన తమ సీటులో ఆశీనులయ్యారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రిగా టీజీ భరత్ బాధ్యతలు తీసుకోనున్న నేపథ్యంలో గురువారం మంగళగిరిలోని ఏపీఐఐసీ కార్యాలయానికి జిల్లా నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు.

కర్నూలు, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): మంత్రి టీజీ భరత్‌ను గురువారం ఆయన చాంబర్‌లో ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి కలిశారు. పూలబొకే ఇచ్చి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా జిల్లాలో తాజా రాజకీయ పరిస్థితులు, ఎన్నికల్లో విజయోత్సవాలపై ఇద్దరు చర్చించినట్లు సమాచారం.



మంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తున్న టీజీ భరత్





... అనే నేను

- నేటి నుంచి అసెంబ్లీ.. కొలువుదీరనున్న మూడో శాసనసభ
- ఎమ్మెల్యేలతో ప్రమాణం చేయించనున్న ప్రొటెం స్పీకర్
- తొలిసారి అసెంబ్లీలో అడుగు పెట్టబోతున్న ఏడుగురు ఎమ్మెల్యేలు
- అమరావతికి చేరుకున్న బంధువులు, సన్నిహితులు

కర్నూలు, జూన్ 20 (ఆంధ్రజ్యోతి):

నవ్యాంధ్ర ముంగిట టీడీపీ ప్రభుత్వం కొలువుదీరింది. ఈ నెల 12న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్, ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, టీజీ భరత్, బీసీ జనార్దన్‌రెడ్డి సహా మంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పాటైన తరువాత తొలిసారిగా శాసనసభ శుక్రవారం సమావేశం కాబోతోంది. రాష్ట్ర విభజన తరువాత ఆంధ్రప్రదేశ్ మూడో శాసనసభ ఇది. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి 14 మంది ఎమ్మెల్యేలతో ప్రొటెం స్పీకర్ ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. ఇందుకోసం ఎమ్మెల్యేలు, వారి బంధుగణంతో పాటు ముఖ్య సహచరులు అమరావతికి చేరుకున్నారు. అయితే.. శాసనసభలో విజిటర్స్ గ్యాలరీలో స్థలం సమస్య కారణంగా విజిటర్స్‌కు అనుమతి లేదని శాసనసభ అధికారులు వెల్లడించడంతో తమ నాయకుడి ప్రమాణస్వీకార మహోత్సవం కళ్లారా చూడలేకపోతున్నామని ఎమ్మెల్యేలు సన్నిహితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తొలి అడుగు

ఉమ్మడి జిల్లాలో 14 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఇటీవల జరిగిన ఎన్నికల్లో 12 స్థానాల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా విజయం సాధించారు. రెండు స్థానాల్లో వైసీపీ ఎమ్మెల్యేలు గెలిచారు. పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు (టీడీపీ), కోడుమూరు (ఎస్సీ) ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి (టీడీపీ), కర్నూలు ఎమ్మెల్యే, మంత్రి టీజీ భరత్ (టీడీపీ), ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి (బీజేపీ), డోన్ ఎమ్మెల్యే, మాజీ కేంద్ర మంత్రి కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి (టీడీపీ), నందికొట్కూరు (ఎస్సీ) ఎమ్మెల్యే గిత్తా జయసూర్య (టీడీపీ), ఆలూరు ఎమ్మెల్యే బి.విరుపాక్షి (వైసీపీ) ఈ ఏడుగురు తొలిసారిగా అసెంబ్లీలో అడుగు పెట్టబోతున్నారు. వీరిలో కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి తొలిసారిగా ఎమ్మెల్యేగా విజయం సాధించి అసెంబ్లీలో అడుగు పెట్టబోతున్నారు. అయితే ఆయన 1991, 2004, 2009 మూడు పర్యాయాలు కర్నూలు ఎంపీగా విజయం సాధించి పార్లమెంట్‌లో ఎంపీగా ప్రమాణ స్వీకారం చేశారు. కేంద్ర రైల్వే సహాయ మంత్రిగా కూడా బాధ్యతలు నిర్వర్తించారు. శాసనసభలో అడుగుపెట్టి ఎమ్మెల్యేలుగా ప్రమాణ స్వీకారం చేయడం ఆనందంగా ఉందని తొలిసారిగా ఎన్నికైన ఎమ్మెల్యేలు పేర్కొన్నారు.

రెండోసారి గెలిచిన ఎమ్మెల్యేలు వీరే

ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీజీ జయనాగేశ్వరరెడ్డి, బనగానపల్లె ఎమ్మెల్యే, మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే, మాజీ మంత్రి భూమా అఖిలప్రియ రెండో పర్యాయం ఎమ్మెల్యేగా గెలిచి అసెంబ్లీలో అడుగు పెట్టబోతున్నారు. 2014లో తొలిసారిగా ఎమ్మెల్యేగా గెలిచిన వీరు.. 2019 ఎన్నికల్లో ఓటమి చెందారు. ఐదేళ్ల తరువాత ఇప్పటి ఈ ఎన్నికల్లో మళ్లీ టీడీపీ అభ్యర్థులుగా పోటీ చేసి విజయం సాధించారు. రెండో సారి అసెంబ్లీలో అడుగు పెట్టబోతున్నారు.

ఆ ముగ్గురు సీనియర్ ఎమ్మెల్యేలు

నంద్యాల నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించి సీఎం చంద్రబాబు మంత్రివర్గంలో మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఎన్ఎండీ ఫరూక్ నాలుగోసారి ఎమ్మెల్యేగా అసెంబ్లీలో అడుగుబోతున్నారు. 1985, 1994, 1999, 2024 ఎన్నికల్లో నంద్యాల నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. రాష్ట్ర విభజన తరువాత ఎమ్మెల్సీగా ఎంపికై శాసన మండలి ఛైర్మన్‌గా కూడా పని చేశారు. తాజాగా ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచారు. ఉభయ సభల్లో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీగా బాధ్యతలు నిర్వర్తించిన అందరికి కంటే సీనియర్. అలాగే.. మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి (వైసీపీ) నాలుగో సారి అసెంబ్లీలో అడుగుపెట్టబోతున్నారు. 2009, 2014, 2019, 2024 వరుసగా ఎమ్మెల్యేగా గెలిచారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మూడోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. 2004లో నందికొట్కూరు నుంచి, 2014, 2024లో పాణ్యం నుంచి విజయం సాధించిన ఈమె మూడోసారి అసెంబ్లీలో అడుగుపెట్టబోతున్నారు. ఉమ్మడి జిల్లాలో ఎమ్మెల్యే ప్రమాణస్వీకరం కోసం పెద్ద సంఖ్యలో వారి కుటుంబ సభ్యులు, ముఖ్య అనుచరులు, సన్నిహిత సహచరులు అమరావతికి తరలివెళ్లారు.



సెలవులో నగర పాలక సంస్థ కమిషనర్

అడిషనల్ కమిషనర్‌కు పీవీ రామలింగేశ్వర్ ఇన్‌చార్జి బాధ్యతలు

కర్నూలు(న్యూసిటీ), జూన్ 20: నగర పాలక సంస్థ కమిషనర్ ఎ.భార్గవతేజ ఆరు రోజులు సెలవులో వెళ్లారు. వ్యక్తిగత పనుల నిమిత్తం 20 నుంచి 25 వరకు సెలవులో వెళ్లనున్నట్లు ఉన్నతాధికారుల అనుమతి కోసం లెటరు పంపారు. కమిషనర్ వచ్చే వరకు అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ ఇన్‌చార్జి కమిషనర్‌గా విధులు నిర్వహిస్తారని కమిషనర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 26న కమిషనర్ తిరిగి విధుల్లో చేరనున్నారు. అయితే నగర పాలక సంస్థ కమిషనర్‌గా ఎ.భార్గవతేజ బాధ్యతలు స్వీకరించి రెండు సంవత్సరాల రెండు నెలలు పూర్తయింది. దీంతో బదిలీపై వెళ్లేందుకు సెలవు పెట్టినట్లు కార్యాలయంలో చర్చించుకుంటున్నారు. ప్రధానంగా విజయవాడలోని సీఆర్‌డీఏ కార్యాలయానికి నియమిస్తారని కొందరు అనుకుంటున్నారు. ఈ నేపథ్యంలో గుంటూరు జాయింట్ కలెక్టర్‌గా వెళ్లేందుకు కమిషనర్ ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

అడ్మిషన్ల కోసం ఇంటింటి ప్రచారం



ఇంటింటి ప్రచారం చేస్తున్న ప్రభుత్వ జూనియర్ కాలేజీలోని అధ్యాపకులు

గూడూరు, జూన్ 20: గూడూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీ అధ్యాపకులు అడ్మిషన్ల కోసం గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు ముద్రించి గూడూరుతోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో తిరిగి పదో తరగతి పూర్తయిన విద్యార్థులను కాలేజీలో చేర్పించాలని కోరుతున్నారు. పల్లెల్లో పెద్ద మనుషులను, హైస్కూల్ హెడ్మాస్టర్లను కలిసి తమ కాలేజీలో 2024 పబ్లిక్ ఎగ్జామ్స్‌లో 83 శాతం ఉత్తీర్ణత సాధించారని తెలియజేశారు. చక్కటి విద్యతో పాటు ల్యాబ్ సదుపాయాలు, ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలపై చక్కటి గైడెన్స్, అవసరమైన కోచింగ్ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ అజయ్ కుమార్ తెలిపారు.

హాస్టల్ మార్చడానికి అనుమతి

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 20: సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు గార్గేయపురంలోని ఎస్సీ హాస్టల్‌కు మార్చాలని అనుకున్నామని, ప్రైవేటు భవనం దొరక్కపోవడంతో అదే పాత భవనంలోనే హాస్టల్ నిర్వహణ చేయాలని చెప్పడంతో తప్పనిసరిగా కొనసాగించాల్సి వచ్చిందని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ బి. చిన్నమదారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19వ తేదీన ఆంధ్రజ్యోతి దినపత్రికలో శిథిల భవనాలు అనే శీర్షికతో కథనం అచ్చయింది. ఈ నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని శిథిలావస్థలో ఉన్న గదులకు తాళం వేశామన్నారు. హాస్టల్‌కు కేవలం ఐదుగురు విద్యార్థులు మాత్రమే వచ్చారన్నారు. హాస్టళ్లను ప్రారంభించలేదన్న దాంట్లో వాస్తవం లేదన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ సభ్యుల పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సహకారంతో పక్కనే ఉన్న పాఠశాలలోని నాలుగు గదులు హాస్టల్స్‌కు ఇవ్వాలని జడ్పీ సీఈవోను, జిల్లా విద్యాశాఖ ను కోరామన్నారు. దానికి వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

కొత్తపల్లి, జూన్ 20: అప్పుల బాధ తాళలేక గురువారం ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల మేరకు.. నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం సింగరాజుపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి వెంకట రమణ (44) తనకున్న రెండెకరాల పొలంతోపాటు మరో నాలుగు ఎకరాలను కౌలుకు తీసుకుని మొక్కజొన్న, పత్తి పంటలు సాగు చేశాడు. రెండేళ్లుగా పంటలు సరిగా పండక తీవ్రంగా నష్టపోయాడు. రూ.10 లక్షల మేర అప్పులు కావడంతో తీర్చలేక గురువారం కొత్తపల్లి, లింగాపురం గ్రామాల మధ్యలోని ఓ పంట పొలంలో పురుగుల మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని కొత్తపల్లి పీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. వెంటకరమణకు భార్య లక్ష్మీదేవి, ముగ్గురు కూతుళ్లు, కుమారులు ఉన్నారు. లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ బాబా ఫక్రుద్దీన్ తెలిపారు.

చెక్‌బౌన్స్ కేసులో నిందితుడికి జైలు జరిమానా

కర్నూలు(లీగల్), జూన్ 20: ఇంటి అవసరాల కోసం అప్పు తీసుకుని ఆ తర్వాత చెల్లని చెక్కు ఇచ్చిన నిందితుడికి ఏడాది కారాగార శిక్ష, రూ.2 లక్షల జరిమానా విధిస్తూ కర్నూలు మొదటి అదనపు జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ టి. జ్యోత్స్న దేవి గురువారం తీర్పు చెప్పారు. స్థానిక బుధవారపేటకు చెందిన కే. శివశంకర్ నుంచి నిర్మల్ కుమార్ రెండు విడతలుగా రూ.2.50 లక్షలను అప్పుగా తీసుకున్నాడు. 2018 మార్చి నెలలో నిర్మల్ కుమార్ రూ.2 లక్షలకు తన బ్యాంకు చెక్కును శివశంకర్‌కు ఇచ్చాడు. ఆ చెక్కును వసూలు కోసం పంపగా.. నిందితుని ఖాతాలో తగిన నిల్వలు లేకపోవడంతో చెక్కు బౌన్స్ అయింది. దీంతో శివశంకర్ నిందితునిపై కేసు దాఖలు చేశారు. కోర్టులో నేరం రుజువు కావడంతో ఏడాది కఠిన కారాగార శిక్ష, బాకీ మొత్తంతోపాటు జరిమానాగా మరో రూ.2 లక్షలు చెల్లించాలని మేజిస్ట్రేట్ తీర్పు ఇచ్చారు.

బీజేపీ నాయకుల మధ్య వాగ్వాదం

రాష్ట్ర ప్రధాన కార్యదర్శిని అడ్డుకున్న స్థానిక నాయకులు



గొడవ పడుతున్న బీజేపీ నాయకులు

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 20: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్ర శివనారాయణకు, కర్నూలు జిల్లా బీజేపీ నాయకులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. రెండు వర్గాల మధ్య మాటా మాటా పెరిగి చేయి చేసుకునే వరకు వెళ్లింది. గురువారం స్థానిక దేవి ఫంక్షన్ హాలులో కర్నూలు పార్లమెంటు నియోజకవర్గ ఎన్నికల సమీక్ష సమావేశం జరిగింది. బీజేపీ సీనియర్ నాయకులు కాళింగి నరసింహవర్మ అకాలమృతి పట్ల బీజేపీ నాయకులు ప్రగాఢ సంతాపాన్ని తెలపలేదని కర్నూలు సీనియర్ నాయకులు సమావేశాన్ని బహిష్కరించి హాలు నుంచి బయటకు వచ్చారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివనారాయణ కారు ఎక్కుతుండగా.. బీజేపీ సీనియర్ నాయకులు కె. కపిలేశ్వరమయ్య, మాజీ కార్పొరేటర్ రంగస్వామి, మాజీ జిల్లా అధ్యక్షుడు రామస్వామితో పాటు మరికొంత మంది అడ్డుకుని దూషించుకున్నారు. బీజేపీ నాయకులు రెండు వర్గాలుగా విడిపోయి వాగ్వివాదానికి దిగారు.

● **ఆదోని ఆర్థిక వ్యవహారమే గొడవకు కారణం:** ఆదోని ఎమ్మెల్యే సీటును వదులుకుంటే రూ.3 కోట్లు ఇస్తామని మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు బంధువుకు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలకంఠ అన్న నాగరాజుకు మధ్య చర్చ జరిగిందని అప్పట్లో దుమారం లేచిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారానికి కారణమైన నీలకంఠను జిల్లా అధ్యక్ష పదవి నుంచి తొలగించాలని సీనియర్ నాయకులు కపిలేశ్వరమయ్య, మరికొంత మంది రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివనారాయణను కోరారు. ఇది బయటి వ్యక్తుల వ్యవహారమని, ఇందులో నీలకంఠ పాత్ర ఏమీ లేదని శివనారాయణను రాష్ట్ర అధ్యక్షుడు వెనుకవేసుకుని వచ్చారు. సమస్య ఉంటే రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకెళ్తానని సమాధానం ఇచ్చారు. దీంతో ఆయన అడ్డగించి దాడి చేసేంత వరకు వెళ్లింది.

రాష్ట్ర దేవదాయశాఖ మంత్రికి సన్మానం



రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి మెమెంటో ఇస్తున్న ఈవో చంద్రశేఖర్‌రెడ్డి

మహానంది, జూన్ 20: రాష్ట్ర దేవదాయశాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఆనం రామనారాయణరెడ్డిని గురువారం మహానంది ఆలయ వేదపండితులు విజయవాడలో ఆశీర్వదించారు. ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనంలో ఆలయ వేదపండితులు, అర్చకులు విజయవాడలోని గొల్లపూడి దేవదాయ, ధర్మధాయశాఖ కార్యాలయంలోని మంత్రి చాంబర్‌లో రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనంను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం శాలువాతో సన్మానించి ఆశీర్వదించారు. ఈవో మంత్రికి మెమెంటోను అందజేశారు. మహానంది ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారు.

కానిస్టేబుల్‌పై అత్యాచార యత్నం కేసు నమోదు

పగిడ్యాల, జూన్ 20: నంద్యాల జిల్లాలో ఓ కానిస్టేబుల్‌పై గురువారం అత్యాచార యత్నం కేసు నమోదైంది. పోలీసుల వివరాల మేరకు.. పగిడ్యాల మండల పరిధిలోని ముచ్చుమర్రి పోలీస్‌స్టేషన్‌లో ఈశ్వర్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి గొడవలు జరగకుండా ఉండేందుకు ఈ నెల 1వ తేదీన నెహ్రూనగర్ గ్రామంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఇందులోభాగంగా గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో రాత్రి బస చేశారు. అయితే దోమల బెడద అధికంగా ఉందని అదే గ్రామానికి చెందిన తన బంధువు అయిన కుమార్‌కు ఫోన్ చేశాడు. దీంతో కుమార్ కానిస్టేబుల్‌ను ఇంటికి తీసుకెళ్లాడు. ఇద్దరూ కలిసి మిద్దెపై పడుకున్నారు. అయితే నిద్రపోతున్నట్లు నటించిన కానిస్టేబుల్ కొద్దిసేపటి తరువాత ఇంటిలోకి ప్రవేశించి కుమార్ భార్యపై అత్యాచార యత్నం చేశాడు. బాధితురాలు పుష్పావతి గురువారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నట్లు ఎస్ఐ జయశేఖర్ తెలిపారు.

16 మంది వైద్యులకు అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి

కర్నూలు(హాస్పిటల్), జూన్ 20: కర్నూలు మెడికల్ కాలేజీలో 16 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లకు అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు లభించాయి. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) గురువారం పదోన్నతుల కౌన్సిలింగ్ నిర్వహించారు. అనస్థీషియాకు చెందిన స్వాతి, ఎం. శారద, చంద్రశేఖర్, జనరల్ మెడిసిన్‌కు చెందిన నిలోఫర్‌సిమా, ఆర్థోకు చెందిన ప్రవీణ్ కుమార్‌బాబు, అర్చనబాబు, పి. కవిత (రేడియాలజీ), పీఆర్ వనజ (బయోకెమిస్ట్రీ), సి.గాయత్రి (బయోకెమిస్ట్రీ), హసీనా (ఫిజియాలజీ), సౌజన్య (న్యూరాలజీ), శ్యాంబాబు (న్యూరాలజీ), సుధాకర్ (ఓంబీసజీ) విజయ్‌బాబు (జనరల్ సర్జరీ), మాధవకృష్ణ (జనరల్ సర్జరీ), పార్వతి, (జనరల్ సర్జరీ) పదోన్నతులు పొందిన వారిలో ఉన్నారు.


సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య

నందికొట్కూరు రూరల్, జూన్ 21: నందికొట్కూరు మండలంలోని శాతనకోట గ్రామానికి చెందిన వడ్ల చంద్రమౌళి(45)అనే వ్యక్తి సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య చేసుకున్నాడు. బ్రాహ్మణకొట్కూరు పోలీసుల వివరాల మేరకు శాతనకోట గ్రామానికి చెందిన వడ్ల చంద్రమౌళి 20 సంవత్సరాల క్రితం చెరుకుచెర్ల గ్రామానికి చెందిన లలితను పెళ్లి చేసుకున్నాడు. భార్యాభర్తలిద్దరూ హైదరాబాద్‌లోని శ్రీరామ చిట్ ఫండ్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. వీరికి సాయిప్రణవ్, సాయి ప్రణీప్ సంతానం. అయితే లలిత తన పై అధికారి వెంకటరెడ్డితో వివాహేతర సంబంధం ఏర్పరచుకుందన్న అనుమానంతో తరచూ ఆమెతో గొడవ పడుతుండేవాడు. చంద్రమౌళికి ఉన్న ఆస్తులను భార్య తెలివిగా రాయించుకుని విడాకులు తీసుకుంది. ఆ తర్వాత ఉన్న ఉద్యోగాన్ని కూడా బదిలీ చేయించడంతోపాటు ఉద్యోగంలో డిమోషన్ చేయించింది. ఇదంతా భరించలేక శాతనకోట గ్రామానికి వచ్చి జరిగినదంతా తండ్రి నారాయణకు తెలియజేశాడు. ఈ క్రమంలోనే బుధవారం రాత్రి తండ్రితో బయటికి వెళ్లి వస్తానని చెప్పి తిరిగి రాలేదు. రాత్రి కావడంతో గ్రామస్థులు గాలించారు. ఊరి బయట వెతకగా చెట్టుకు ఉరివేసుకుని కనిపించాడు. తండ్రి వడ్ల నారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

సీఐ మారుతి శంకర్‌కు జైలు శిక్ష

నందికొట్కూరు, జూన్ 20: ఓ వ్యక్తి వేసిన ప్రైవేట్ కేసులో సీఐ మారుతి శంకర్‌కు సంవత్సరం జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ నందికొట్కూరు ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ దివ్య తీర్పునిచ్చారు. 2013లో ముచ్చుమర్రి ఎస్ఐగా మారుతి శంకర్ విధులు నిర్వహిస్తున్న సమయంలో పగిడ్యాల మండలం ఘణపురం గ్రామానికి చెందిన నాగిరెడ్డి తన కుమారుడైన నరేంద్రారెడ్డికి తలెత్తిన వివాదంలో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. స్టేషన్‌కు తీసుకెళ్లేందుకు వచ్చిన పోలీసులతో వారెంట్ ఉందా అని నరేంద్రారెడ్డి ప్రశ్నించాడు. దీంతో ఎస్ఐ మారుతి శంకర్ బాధితునిపై దాడి చేశారని ప్రైవేటు కేసు వేశారు. దీంతో నందికొట్కూరు కోర్టు సంవత్సరం జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చింది. అయితే బెయిల్‌పై విడుదలైనట్లు తెలిసింది. మారుతి శంకర్ ప్రస్తుతం చిత్తూరు జిల్లాలోని గంగాధర నెల్లూరు పోలీస్‌స్టేషన్‌లో సీఐగా విధులు నిర్వహిస్తున్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి



ప్రసంగిస్తున్న న్యాయాధికారి బి.లీలా వెంకట శేషాద్రి

కర్నూలు(లీగల్), జూన్ 20: పర్యావరణాన్ని ప్రతి ఒక్కరూ పరిరక్షించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయా ధికారి బి. లీలా వెంకట శేషాద్రి తెలిపారు. గురువారం ఘన వ్యర్థాల నిర్వహణ అంశంపై స్థానిక న్యాయ సేవాసదన్ భవనంలో ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని ఘన వ్యర్థాలు కూడా కాలుష్యం చేసే ప్రమాదం ఉందని, కాబట్టి వాటిని వీలైనంత వరకు నివాస స్థలాలకు దూరంగా ఉంచాలని అన్నారు. ఘన వ్యర్థాలైన మెడికల్, బయోమెడికల్, బాటరీ వ్యర్థాలు, ఈ-వ్యర్థాలు, రేడియో యాక్టివ్ వ్యర్థాలు లాంటి వాటిని ఘన వ్యర్థాల పట్ల తగు జాగ్రత్త వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీపీవో నాగరాజునాయుడు, డీఎల్‌పీవో ఎస్. నూర్జహాన్, డీఆర్పీ వి.జేమ్స్ కృపావరం, కాలుష్య నియంత్రణ మండలి సైంటిఫిక్ ఆఫీసర్ గణేష్ కుమార్, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశంలోకి ముగ్గురు కౌన్సిలర్లు

- నేడు మరో నలుగురు చేరే అవకాశం
- మున్సిపాలిటీ పీఠం టీడీపీ కైవసం?



భార్గవ్‌రామ్‌నాయుడు సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్లు

ఆళ్లగడ్డ, జూన్ 20: ఆళ్లగడ్డ మున్సిపాల్టిలోని వైసీపీకి చెందిన 26 వార్డు కౌన్సిలర్ మహబూబ్ బాషా, 13వ వార్డు కౌన్సిలర్ మునగాల సంజీవ, 8వ వార్డు కౌన్సిలర్ సోముల మధు సూదన్‌రెడ్డి టీడీపీ నాయకుడు భార్గవ్‌రామ్‌నాయుడు సమక్షంలో గురువారం టీడీపీ చేరారు. వీరితో పాటు వైసీపీ నాయకులు తలారి శీను, నగరం రాజు, చేరారు. దీంతో టీడీపీ ఖాతాలో ఏడుగురు కౌన్సిలర్లు ఉన్నారు. మరో నలుగురు శుక్రవారం చేరేందుకు వైసీపీ కౌన్సిలర్లు సిద్ధంగా ఉన్నారు. వీరితో టీడీపీ కౌన్సిలర్ల సంఖ్య 11కు చేరుకోనుంది. మున్సిపాలిటీలో 27 మంది కౌన్సిలర్లు ఉన్నారు. శుక్రవారం నలుగురు కౌన్సిలర్లు టీడీపీలో చేరితే మరో ముగ్గురు కౌన్సిలర్లు మాత్రమే అవసరం ఉంటుంది. ఇదిలా ఉండగా కౌన్సిల్‌లో ఎమ్మెల్యేకు, ఎంపీకి సభ్యత్వం ఉంటుంది. దీంతో టీడీపీ కౌన్సిలర్ల సంఖ్య 13కు చేరుతుంది. ఛైర్మన్ పదవి కోసం ఒక్క కౌన్సిలర్ అవసరం. ఆ కౌన్సిలర్ కూడా టీడీపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. దీంతో ఆళ్లగడ్డ మున్సిపాలిటీలో 2017 నాటి పరిస్థితులు పునరావృతం కానున్నట్లు తెలుస్తోంది. ఆ సమయంలో దివంగత భూమా నాగిరెడ్డి వైసీపీ నుంచి టీడీపీలో చేరటంతో వైసీపీ కౌన్సిలర్లు టీడీపీలో చేరటంతో ఛైర్మన్ పదవి టీడీపీ కైవసం చేసుకుంది.

ఆంధ్రజ్యోతి చిన్న ప్రకటన - పెద్ద స్పందన CLASSIFIEDS

కావలెను

వార్డెన్, సోషియల్ ఇంగ్లీష్, మాథ్స్ మరియు ఫిజికల్ సైన్స్ టీచర్స్ కావలెను. బాలచంద్ర సమత స్కూల్, టెక్కె, నంద్యాల సంప్రదించండి. సెల్: 93988 37182.

AJL- 186469

అర్జెంట్‌గా కావలెను

నంద్యాల జిల్లా, బనగానపల్లె, నెహ్రూ హైస్కూల్ నందు ప్రైమరీ, మిడిల్, హైస్కూల్ సెక్షన్లలో పనిచేయుటకు హిందీ టీచర్లు, పీఈటీలు, హాస్టల్ వార్డెన్లు, కేర్ టేకర్లు కావలెను. సంప్ర.: 63020 26495, 94402 32715, 94410 56875.

AJL-DHONE

CHANGE OF NAME

I, MOHAMMED ISMAIL (Old Name) S/o.MOHAMMEDABDUL HAI R/o. D.No: 1/662/A, KHOONI MOHALLA STREET, ADONI -518301, KURNOOL, AP., I have changed my name as MUJAVAR ISMAIL (New Name) S/o.MUJAVAR ABDUL HAI Hereafter my name is MUJAVAR ISMAIL (New Name) S/o.MUJAVAR ABDUL HAI

AJL-KNL

CHANGE OF NAME

I, ALAGANURU VENKATA UDHAYA BHASKAR (Old Name) R/o.86/296-B, Mahalakshmi Nagar, Near Military canteen, Kallur (M), Kurnool dist, AP., ALAGANURU VENKATA UDHAY BHASKAR (New Name) S/o.RAMESH BABU ALAGANURU VENKATA

AJL-KNL

CHANGE OF NAME

I, SHAIK NAZEER AHAMED (Old Name), R/o. H.No:32/378, Gadda Street, Kurnool dist, AP., have changed my name as GOUNDA NAZEER AHMMED (New Name) S/o.SHAIK GHOUSE AHAMED

AJL-KNL

కావలెను

బాల మద్దిలేటి & సన్స్, హేర్ & బ్యూటీ సెలూన్ A/c లో పనిచేయుటకు వర్కర్స్ కావలెను. సంప్ర. సెల్: 9885446126, 8897476747, జీతం: 18,000, రూమ్ సౌకర్యం కలదు.

AJL-186473

CHANGE OF NAME

I, PATWAGER HUMAR THASEEN (Old Name) W/o. KIRANAM SHAFEEQ AHAMED, R/o. H.No:32-522, Badi Beeth, One Town, Kurnool-51801, AP., I have changed my name as PATWAYGAR HUMARA THASEEN (New Name) W/o. KIRANAM SHAFEEQ AHAMED.

AJL-186417

కావలెను

అనంతపురంలో గల రాజు ఫ్లెక్స్ నందు పని చేయుటకు ఫోటోషాపులో అనుభవం కల డిజైనర్లు కావలెను జీతం:25,000+ Cell:9177198103.

AJA- 189262

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర: 7382114647

AJA- 189263

SITE FOR SALE

» 2.755 cents, 30x40 ft, North, East corner site with Bore well Kurnool, New postal colony near Sai baba Temple for sale. Only interested purchaser to contact 87126 25459. No brokers please.

AJB - 194710

FOR ADVERTISEMENTS CONTACT. Cell: 99854 11369

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన/ క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి

వెంటిలేటర్లు లేక అవస్థలు

- క్యాజువాల్టీలో దారుణం
- గంటసేపు అంబులెన్సులోనే ఉన్న రోగి

కర్నూలు(హాస్పిటల్), జూన్ 20: అనంతపురం జిల్లా గుత్తి పట్టణానికి చెందిన నాగేంద్ర అనే రోగికి బ్రెయిన్ స్ట్రోక్ వచ్చింది. హుటాహుటిన అనంతపురంలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు వెళ్లారు. అక్కడ పరిస్థితి విషమించడంతో అంబులెన్సులో గురువారం సాయంత్రం 5.10 గంటలకు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వచ్చారు. అక్కడ క్యాజువాల్టీలో వెంటిలేటర్ బెడ్లు ఖాళీగా లేకపోవడంతో గంటసేపు రోగిని అంబులెన్సులోనే ఉంచాల్సి వచ్చింది. అత్యవసర రోగులకు ఎంతో కీలకమైన క్యాజువాల్టీలో ఆరు వెంటిలేటర్లే ఉండగా అందులోనూ ఒకటి పని చేయడం లేదు. మిగిలిన ఐదు వెంటిలేటర్లపై అత్యవసర రోగులు చికిత్సపొందుతున్నారు. దీంతో నాగేంద్ర అనే రోగి వెంటిలేటర్ లేక నరకయాతన అనుభవించాడు. ఈ కేసు గురించి పట్టించుకోవాలని ఆదోని ఎమ్మెల్యే ఫోన్ చేయడంతో ఆసుపత్రి సూపరింటెండెంట్ క్యాజువాల్టీకి వచ్చి వెంటిలేటర్ల పరిస్థితిపై ఆరా తీశారు. రోగిని తక్షణమే అడ్మిట్ చేసుకుని వెంటిలేటర్ అమర్చాలని క్యాజువాల్టీని సీఎంవో క్లింటన్‌ను ఆదేశించారు. చివరకు సాయంత్రం 6.10 గంటలకు రోగిని అడ్మిట్ చేసుకోవడంతో బంధువులు ఊపిరి పీల్చుకున్నారు. అంతకుముందు అనంతపురానికి చెందిన ఓ మహిళ కూడా వెంటిలేటర్ లేకపోవడంతో క్యాజువాల్టీ నుంచి అనంతపురం తిరుగుముఖం పట్టారు. ఇప్పటికైనా కలెక్టర్, ఆసుపత్రి అధికారులు స్పందించి క్యాజువాల్టీ ఏఎంసీలో పడకలు, వెంటిలేటర్లను పెంచాలని రోగులు కోరుతున్నారు.


గుత్తికి చెందిని రోగిని క్యాజువాల్టీలోకి తీసుకెళ్తున్న సిబ్బంది

కష్టకాలంలో పార్టీకి పెద్దదిక్కుగా పని చేశారు

నారా భువనేశ్వరికి బీటీ నాయుడు శుభాకాంక్షలు


నారా భువనేశ్వరితో బీటీ నాయుడు

కర్నూలు(అర్బన్), జూన్ 20: తెలుగుదేశం పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు నారా భువనేశ్వరి తన వంతు పాత్ర పోషించారని శాసన మండలి ఉపనేత, ఎమ్మెల్సీ బీటీ నాయుడు కొనియాడారు. గురువారం విజయవాడలోని ఉండవల్లి నివాసంలో చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరిని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా రాష్ట్రంలో ఎంతో మంది నిరుపేద పిల్లలకు ఎన్టీఆర్ మోడల్ స్కూల్ ద్వారా విద్యను అందించారన్నారు.

యోగాతో మానసిక వికాసం


యోగా అభ్యాసనాలు చేయిస్తున్న బీటీ జయలక్ష్మి

కర్నూలు(కల్చరల్), జూన్ 19: యోగాతో మానసిక వికాసం కలుగుతుందని యోగా గురువు బీటీ జయలక్ష్మి అన్నారు. రానున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని గురువారం సాయంత్రం నగర శివారు మామిదాల పాడులోని గోదా గోకులం క్షేత్రంలో ఆమె యోగ ఆవశ్యకతపై ప్రసంగించారు. మహిళా సభ్యులతో సామూహిక యోగ అభ్యాసనం చేయించారు. ఈ సందర్భంగా బీటీ జయలక్ష్మి మాట్లాడుతూ ఆధునిక కాలంలో అనేక రుగ్మతలు పట్టి పీడిస్తున్నాయన్నారు. ఐదేళ్ల పిల్లల నుంచి వయోవృద్ధుల వరకు వివిధ జబ్బులతో సతమతమవుతున్నారని అన్నారు. యోగ అభ్యాసనాలతో శరీరంలో నాడీ వ్యవస్థ మెరుగుపడుతుందని, అలాగే రక్తనాళాలకు, శరీరంలోని కండ రాలకు శక్తి చేకూరి నీరసం లేకుండా జీవిస్తామని అన్నారు. కార్యక్రమంలో గోదా గోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజ గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, సభ్యులు పాలాది సుబ్రహ్మణ్యం, తల్లం నాగనారాయణరావు, శ్రీనాథ్, ఇటిక్యాల పుల్లయ్య, ఎస్ మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

యోగా అభివృద్ధికి పాటుపడుతాం


ట్రాక్ షూట్లను అందజేస్తున్న యోగా క్రీడా సంఘాల ప్రతినిధులు

కర్నూలు(స్పోర్ట్స్), జూన్ 20: ప్రతిభ గల యువ యోగా క్రీడాకారులను ప్రోత్సహించేందుకు యోగా సంఘం, డీఎస్ఏ కర్నూలు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, జాతీయ యోగా సంఘం సంయుక్త కార్యదర్శి శ్రీధర్ రెడ్డి అన్నారు. పదో అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని గురువారం నగరంలోని డీఎస్ఏ యోగా హాల్‌లో జిల్లా నుంచి జాతీయ స్థాయి పోటీలలో పతకాలు సాధించిన క్రీడాకారులకు ప్రోత్సాహకంగా జిల్లా యోగా సంఘం తరపున ట్రాక్ షూట్లను అందజేశారు.

ఒలింపిక్ పరుగు టీషర్టుల ఆవిష్కరణ


టీషర్టులను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి కేఈ ప్రభాకర్

కర్నూలు(స్పోర్ట్స్), జూన్ 20: ఈనెల 22న కర్నూలులో జరగనున్న ఒలింపిక్ పరుగుకు సంబంధించిన టీషర్టులను మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కేఈ జగదీష్ కుమార్, శ్రీనివాసులు, వెటర్నత్లెట్స్ పాండురంగారావు, కబడ్డీ సంఘం కార్యదర్శి సుధాకర్, శ్రీనివాసులు, సునీల్ కుమార్ పాల్గొన్నారు.

23న బ్రాహ్మణ ఆత్మ గౌరవ అభినందన సభ

కర్నూలు(న్యూసిటీ), జూన్ 20: బ్రాహ్మణ ఆత్మగౌరవ అభినందన సభ ఈనెల 23న నిర్వహిస్తున్నట్లు ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటరామరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గన్నవరం ఎయిర్ పోర్టు ఎదురుగా ఉన్న భువనేశ్వరీ పీఠం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అభినం దన సభకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మానవవనరులు ఐటీ ఎలక్ట్రానిక్ శాఖ మంత్రి నారాలోకేష్‌తో పాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరవుతారని, రాష్ట్రవ్యాప్తంగా బ్రాహ్మణులు అభినందన సభకు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలకు విద్యార్థిని ఎంపిక

కర్నూలు(స్పోర్ట్స్), జూన్ 20: కర్నూలు స్పోర్ట్స్ అథారిటీ అవుట్‌డోర్ స్టేడియంలో ఈ నెల 15న నిర్వహించిన జిల్లా స్థాయి ఆర్చరీ ఎంపిక పోటీలలో ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థిని కియానా అండర్-10 బాలికల విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ జస్మిత్ కౌర్ శేఖాన్ గురువారం తెలిపారు. ఎంపికైన విద్యార్థిని విజయవాడలో ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు జరగబోయే రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలలో జిల్లా జట్టు తరుపున పాల్గొంటున్నట్లు తెలియజేస్తూ క్రీడాకారిణిని అభినందించారు.

స్కేటింగ్ పోటీల్లో రాణించాలి


స్కేటింగ్ పోటీలను ప్రారంభిస్తున్న క్రీడా ప్రతినిధులు

కర్నూలు(స్పోర్ట్స్), జూన్ 20: ఒలింపిక్ డే సంబరాల్లో భాగంగా గురువారం జోహరాపురం సమీపంలో ఉన్న స్కేటింగ్ రింక్‌లో చిన్నారులకు స్కేటింగ్ పోటీలు ప్రారంభమయ్యాయి. జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు, స్కేటింగ్ సెంటర్ కోచ్ ఆర్.అనంత, క్రీడా సంఘాల ప్రతినిధి గంగాధర్‌లు ప్రారంభించారు.

హాస్టల్‌ను తనిఖీ చేసిన జాయింట్ డైరెక్టర్


హాస్టల్‌ను పరిశీలిస్తున్న జాయింట్ డైరెక్టర్ రంగలక్ష్మీదేవి

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 20: కర్నూలు మండలంలోని గార్గేయపురం హాస్టల్‌ను సాంఘిక సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్ రంగలక్ష్మీదేవి గురువారం తనిఖీ చేశారు. వసతి గృహంలోని గదులన్నింటినీ పరిశీలించారు. పెచ్చులు ఊడి, వర్షం నీరుతో అస్తవ్యస్తంగా ఉందని, విద్యార్థులకు అసౌకర్యంగా ఉందన్నారు. అలాగే పక్కన ఉన్న పాఠశాల గదులను పరిశీలించారు. కొన్ని గదుల హాస్టల్ విద్యార్థులకు కేటాయించేలా విద్యాశాఖ అధికారుల అనుమతి త్వరగా తీసుకుని విద్యార్థులను షిఫ్టు చేయాలన్నారు. జాయింట్ డైరెక్టర్ వెంట ఏఎస్‌డబ్ల్యూవో మద్దిలేటి, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ చిన్న మదారి ఉన్నారు.

అధికారమే లక్ష్యంగా పని చేద్దాం

జిల్లా నాయకులతో పీసీసీ షర్మిల సమీక్ష


మాట్లాడుతున్న వైఎస్ షర్మిల

కర్నూలు(అర్బన్), జూన్ 20: అధికారమే లక్ష్యంగా పని చేయాలని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. గురువారం విజయవాడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైఎస్ షర్మిల జిల్లా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల సమావేశంలో ఏఐసీసీ సెక్రటరీ మయప్పన్‌తో కలిసి సమీక్షించారు. పార్టీ పురోగతి, అనుసరిస్తున్న విధివిధానాలపై చర్చించారు. 2029 ఎన్నికల్లో రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి అభ్యర్థిగా, రాష్ట్రంలో అధికారం దిశగా పార్టీ ముందుకు సాగాలని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు సూచించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ కర్నూ లు ఎంపీ అభ్యర్థి లక్కీటూ రాంపుల్లయ్య యాదవ్, సీనియర్ నాయకులు నరసింహులు యాదవ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గం అభ్యర్థులు ఖాసింవలి, రమేష్ యాదవ్, మురళీకృష్ణ, నవీన్ కిషోర్ చౌదరి, మురళీకృష్ణరాజు, జిలానీ బాషా పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలను తరలించవద్దు


నిరసన తెలుపుతున్న ఐక్యవేదిక ప్రతినిధులు

కర్నూలు (రాజ్‌విహార్ సర్కిల్), జూన్ 20: ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం ప్రకారం కర్నూలులో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి కార్యాలయాలను యథావిధిగా కొనసాగించాలని ప్రజాస్వామ్య సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. గురువారం నగరంలోని స్థానిక పీవోడబ్ల్యూ కార్యాలయంలో సంఘం కన్వీనర్ రామకృష్ణారెడ్డి అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలులో ఏర్పాటు చేసిన మానవ హక్కుల కమిషన్, వక్ఫ్‌బోర్డు, విద్యుత్ నియంత్రణ ఆథారిటీ కార్యాలయాలను అమరావతికి తరలించాలన్న ఆలోచనను విరమించుకోవాలని కోరారు. వాటిని ఇక్కడే కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని, శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం కర్నూలులోనే హైకోర్టు ఏర్పాటు చేయాలన్నారు. కృష్ణానది యజమాన్య బోర్డు కార్యాలయాన్ని స్థానికంగా ఏర్పాటు చేయటంతోపాటు రాయల సీమలోని అపరిష్కృత ప్రాజెక్టులను తక్షణమే పూర్తి చేయాలని ఆయన డిమాండు చేశారు. రాయలసీమకు అన్యాయం చేసే విధానాలను నూతన ప్రభుత్వం విడనాడాలని, కోస్తా ప్రాంతంతో సమానంగా రాయలసీమను అభివృద్ధి చేయాలన్నారు. సమావేశంలో ఐక్యవేదిక ప్రతినిధులు వాడాల చంద్రశేఖర్‌రెడ్డి, డేవిడ్, సుంకన్న, సుబ్బారాయుడు, మనోహర్ మాణిక్యం, రత్నం ఏసేపు, ఇమ్మానుయేల్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అమరావతికి తరలించొద్దు: రాయలసీమ విద్యార్థి పోరాట సమితి

కర్నూలు(అర్బన్): ప్రభుత్వ కార్యాలయాలు కర్నూలు నుంచి అమరావతికి తరలించొద్దని రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్ అన్నారు. గురువారం నగరంలోని రాష్ట్ర స్థాయి సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాయలసీమ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు సుంకన్నతో కలిసి ఆయన మాట్లాడారు. పాలకుల నిర్లక్ష్యం వలన తరతరాలుగా రాయలసీమకు వివక్షకు గురవుతూనే ఉందన్నారు. కర్నూలు జిల్లాలో రాష్ట్ర స్థాయి కార్యాలయాలైన మానవహక్కుల కమిషన్, లోకాయుక్త, విద్యుత్ రెగ్యులేటరీ అథారిటీ, వక్ఫ్ బోర్డు కార్యాలయాలు ఏర్పాటయ్యాయని, వాటిని కొత్త ప్రభుత్వం తరలించకుండా ఇక్కడే కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు విద్యా సాగర్, నాగేస్, అశోక్, మల్లప్ప పాల్గొన్నారు.

బాలికల విద్యను ప్రోత్సహించండి


డీఆర్వోకు వినతి పత్రం ఇస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

కర్నూలు(కలెక్టరేట్), జూన్ 20: కేజీబీవీలలో హాస్టల్ సీట్లు పెంచి బాలికల విద్యను ప్రోత్సహించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్యం విద్యార్థి (పీడీఎస్‌యూ) జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మహేంద్రబాబు, జిల్లా అధ్యక్షుడు అఖండ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో డీఆర్వో మధుసూదన్‌రావుకు వారు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహేంద్రబాబు, అఖండ మాట్లాడుతూ రాష్ట్రంలోనే కర్నూలును కరువు జిల్లాగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. అయితే హాస్టళ్లలో బాలికలకు సీట్లు లేకపోవడంతో తల్లిదండ్రులు వారి వెంట వలసలకు తీసుకెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మునిస్వామి, రసూల్, జగన్, ఆలి పాల్గొన్నారు.

● **విద్యార్థులకు సీట్లు మంజూరు చేయాలి:** జిల్లా వ్యాప్తంగా బీసీ సంక్షేమ హాస్టల్‌లో విద్యార్థులకు సీట్లు మంజూరు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు రమణ కుమార్ కోరారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో డీఆర్వో మధుసూదన్‌రావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వీరేష్, నరేంద్ర పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

కేంద్ర కరువు బృందానికి టీడీపీ నాయకుల వినతి


కేంద్ర కరువు బృందానికి వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

కల్లూరు, జూన్ 20: 2023-24 రబీ సీజన్లో తీవ్ర వర్షాభావం వల్ల పంటలు నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని టీడీపీ నాయకులు రామలింగారెడ్డి, క్షత్రపతిరెడ్డి కేంద్ర కరువు బృందాన్ని కోరారు. గురువారం కల్లూరు, ఓర్వకల్లు మండలాలకు సంబంధించిన రైతన్నల సమస్యలను కేంద్ర కరువు బృందానికి టీడీపీ నాయకులు వివరించారు. రబీ సీజన్లో పంటసాగుకు పెట్టిన పెట్టుబడి చేతికి రాక రైతులు అప్పుల పాలయ్యారని పంటలు నష్టపోయిన రైతులందరికీ నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. కల్లూరు మండల తహసీల్దారు మునివేలు అధికారులు పాల్గొన్నారు.

రెవెన్యూ శాఖ కీలకం: తహసీల్దార్


వీఆర్వోలను సన్మానిస్తున్న అధికారులు

కోడుమూరు, జూన్ 20: సమాజాన్ని నడిపించడంలో రెవెన్యూ శాఖ కీలకంగా వ్యవహరిస్తోందని తహసీల్దార్ గుర్రప్ప అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 1786లో ఏర్పాటు అయిందన్నారు. రెవెన్యూ శాఖలో పని చేయడం ఎంతో గౌరవించదగ్గ విషయం అని సంతోషించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఐ మన్సురుద్దీన్ మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో కొంత భాగం పోలీసు డిపార్టుమెంటు కూడా ఉందన్నారు. ఈసందర్భంగా రిటైర్డ్, సీనియర్ వీఆర్వోలు చంద్రశేఖర్‌రావు, విశ్వనాథరెడ్డి, సంజీవరెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రామాంజనేయులు, సర్వేయర్ సునీల్, అమినాబీ, వీఆర్వోలు ఎల్లప్ప, నారాయణ, పరమేష్, మధు, మహేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

రెవెన్యూ శాఖ మంత్రికి శుభాకాంక్షలు


రెవెన్యూ శాఖ మంత్రికి పుష్పగుచ్ఛం ఇస్తున్న మౌలిబాషా

కర్నూలు(కలెక్టరేట్), జూన్ 20: ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ విలేజ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మౌలి బాషా గురువారం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి సత్యప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. వీఆర్వోల సమస్యల పరిష్కారం కోసం త్వరలో సమావేశం ఏర్పాటు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు.

గిరిజనుల అభివృద్ధికి కృషి

కర్నూలు(కలెక్టరేట్), జూన్ 20: రాష్ట్రంలోని గిరిజన అభివృద్ధికి కృషి చేస్తానని ఏపీ స్టేట్ కమిషనర్ ఫర్ షెడ్యూల్ ట్రైబ్స్ సభ్యుడు వాడిత్య శంకర్ నాయక్ అన్నారు. గురువారం నగరంలోని స్టేట్ గెస్టు హౌస్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యతోనే గిరిజనుల అభివృద్ధి జరుగుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల అభివృద్ధి కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లోని గిరిజనుల బ్యాక్‌లాక్ పోస్టుల భర్తీ చేస్తామని, గిరిజన రైతుల సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. కార్యక్రమంలో గిరిజన ప్రజా సమైఖ్యం రాష్ట్ర అద్యక్షుడు రాజు నాయక్ పాల్గొన్నారు.

గూడూరులో రెవెన్యూ దినోత్సవం


మాట్లాడుతున్న తహసీల్దార్ ఉదయ్ సంతోష్

గూడూరు, జూన్ 20: గూడూరులో తహసీల్దార్ ఉదయ్ సంతోష్ ఆధ్యక్షతన రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ దినోత్సవం ప్రత్యేకతను వివరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పొలాలకు వెళ్లే రోడ్డు పరిశీలన

ఓర్వకల్లు, జూన్ 20: మండల కేంద్రమైన ఓర్వకల్లులోని అబ్దుల్లా ఇంటి పక్కల పొలాలకు వెళ్లే రోడ్డును ఆర్అండ్‌బీ డీఈ రుక్మిణి గురువారం పరిశీలించారు. వర్షాలు అధికమైతే పొలాల్లో నుంచి వర్షం నీరు గ్రామంలోని కల్లాల్లోకి పారుతుందని, దీంతో కల్లాల్లో ఉన్న పశుగ్రాసం తడిసి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ప్రత్యామ్నాయంగా ఆ నీటిని పైపులైన్ ద్వారా పోయేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దేవేంద్రరెడ్డి, రాంభూపాల్ రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, ఈవోఆర్డీ సుబ్బరాయుడు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక వివాహాలు


మాట్లాడుతున్న కార్పొరేషన్ ఈడీ సబిహ పర్వీన్

కర్నూలు(న్యూసిటీ), జూన్ 20: ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని చౌక్‌బజార్ టీబీ ఫంక్షన్ హాలులో గురువారం సామూహిక వివాహాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఈడీ సబిహ పర్వీన్ హాజరై మాట్లాడుతూ గతంలో అల్ హజ్ అబ్దుల్ గఫూర్ అండ్ ఖమ్రున్నీస బేగం, పూర్ గర్ల్స్ మ్యారేజ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే వారని తెలిపారు. ఇటీవల వారు చనిపోవడంతో సామూహిక వివాహాలు ఆగిపోకూడదనే ఉద్దేశంతో ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు పి.ఇక్బాల్ హుస్సేన్, కార్యదర్శి ఎస్ఎండీ షరీఫ్, మదీనా కళాశాల కరస్పాండెంట్ ఎం.మహ్మద్, సయ్యద్ అహ్మద్, అబ్దుల్ దేశాయ్, వధూవరులు పాల్గొన్నారు.

వార్డులో నీటి సమస్య పరిష్కారం

గూడూరు, జూన్ 20: గూడూరులోని తొమ్మిదో వార్డులో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించినట్లు కౌన్సిలర్ కోడుమూరు షాషావలి, టీడీపీ నాయకుడు రేమట వెంకటేష్ అన్నారు. గురువారం గూడూరు నగర పంచాయతీ పరిధిలోని తొమ్మిదో వార్డులో బోరు చెడిపోవడంతో నీటి సమస్య నెలకొంది. వార్డు ప్రజలు ఈ విషయాన్ని కౌన్సిలర్ కోడుమూరు షాషావలి, టీడీపీ యువనేత రేమట వెంకటేష్‌ల దృష్టికి తీసుకెళ్ళారు. దీంతో వారు మున్సిపల్ సిబ్బందితో మాట్లాడి బోరుకు మరమ్మతులు చేయించి నీటి సమస్యను తీర్చారు. అలాగే శాశ్వత నీటి పరిష్కారం కోసం జిల్లా టీడీపీ సీనియర్ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళారు. వార్డులో కొత్త బోరు వేయిస్తామని హామీ ఇచ్చారన్నారు.

హ్యాండ్ బాల్ విజేత మాంటిస్సోరి


విజేతలతో కార్యదర్శి రుద్రరెడ్డి

కర్నూలు(స్పోర్ట్స్), జూన్ 20: బాలికల అంతర్ పాఠశాల హ్యాండ్‌బాల్ విజేతగా మాంటిస్సోరి పాఠశాల జట్టు నిలిచింది. రన్నర్‌గా సెయింట్ జోసెఫ్ పాఠశాల ఎస్ఆర్‌పేట జట్టు సరిపుచ్చుకుంది. జిల్లా ఒలంపిక్ డే రన్ సందర్భంగా పోటీలు నిర్వహించారు. డీఎస్ఏ స్టేడియంలో నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో 4-3 పాయింట్లతో మాంటిస్సోరి పాఠశాల జట్టు గెలిచింది. బాలుర విభాగంలో మాంటిస్సోరి పాఠశాల సెయింట్ జోసెఫ్‌పై 9-8 పాయింట్లతో విజయం సాధించిందని కార్యదర్శి రుద్రరెడ్డి తెలిపారు.

జిల్లా స్థాయి ఆటల పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


జి.పుల్లయ్యతో క్రీడాకారులు

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 20: స్థానిక అబ్బాస్ నగర్‌లోని రవీంద్ర విద్యానికేతన్ పాఠశాలకు చెందిన విద్యార్థులు కర్నూలు ఒలింపిక్ డిస్ట్రిక్ట్ అసోసియేషన్ నిర్వహించిన జిల్లా స్థాయి ఆటల పోటీల్లో రవీంద్ర విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. రవీంద్ర బాలికల పాఠశాలల అండర్-17 బాలికల విభాగంలో వాలీబాల్ పోటీలో గోల్డ్‌మెడల్ కైవసం చేసుకున్నారు. యోగా పోటీలో సాకేత్ గోల్డ్‌మెడల్, అండర్-12 విభాగంలో లిఖిత్ గోల్డ్‌మెడల్, చెస్ పోటీలో శ్రీరామ్ 8వ తరగతి విద్యార్థి సిల్వర్ మెడల్ కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో రవీంద్ర విద్యాసంస్థల అధినేత పుల్లయ్య మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి ఆటల పోటీల్లో రాణించినందుకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన ఆదోని ఎమ్మెల్యే


సీఎం చంద్రబాబుకు పూలబొకే అందజేస్తున్న ఆదోని ఎమ్మెల్యే పార్థసారధి

కర్నూలు, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): ఆదోని బీజేపీ ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధి గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిశారు. శుక్రవారం శాసన సభ సమావేశం ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా టీడీపీ కూటమికి చెందిన బీజేపీ ఎమ్మెల్యేలు చంద్రబాబును కలిశారు. ఆదోని అభివృద్ధికి సంపూర్ణ సహకారం, అవసరమైన నిధులు మంజూరు చేయాలని డాక్టర్ పార్థసారధి సీఎం దృష్టికి తీసుకెళ్లారు.

భూముల ధరలకు రెక్కలు


ఆలూరులో గాలిమరలు ఏర్పాటుకు సిద్ధంగా ఉన్న సామగ్రి

- ఆలూరు పరిధిలో 300 గాలిమరల ఏర్పాటుకు సన్నాహాలు
- రాజకీయ నేతలకు పండగే... పండగ
- రైతులను ఒప్పించేందుకు రంగంలో దిగిన దళారులు
- నిరుద్యోగులకు లభించనున్న ఉద్యోగ అవకాశాలు



ఆలూరు, జూన్ 20: ఆలూరు నియోజకవర్గంలో 300కు పైగా గాలిమరల ఏర్పాటుకు వివిధ కంపెనీలు ముందుకు రావడంతో ఆలూరు, అస్పరి, హొలహర్వి మండలాల్లోని వ్యవసాయ భూములకు భారీగా డిమాండ్ పెరిగింది. గాలిమరల ఏర్పాటుకు అనుకూలమైన భూముల కోసం కంపెనీలు అన్వేషిస్తున్నాయి.

● ఇప్పటికే 200కు పైగా గాలిమరలు..

7 ఏళ్ల క్రితం ఆలూరు పరిధిలోని మొలగవల్లి, జోహరాపురం, ఆలూరులో 200కు పైగా గాలిమరలు ఏర్పాటు చేశారు. మరో 300 అదనంగా విండ్ పవర్ ప్యాన్లు ఏర్పాటు కానుండటంతో ఆయా గ్రామాల రాజకీయ నాయకులకు ఆదాయవనరుగా మారనుంది.. వారి ద్వారానే అందుకు కావాల్సిన భూములను రైతుల దగ్గర నుంచి ఇప్పించేందుకు దళారులు రంగంలోకి దిగారు. రైతుల నుంచి తక్కువ ధరకు మాట్లాడి కంపెనీలకు ఎక్కువ ధరకు అమ్మిస్తున్నారు. ఇద్దరి దగ్గర కమీషన్ తీసుకునేందుకు సిద్ధమయ్యారు.

● యువతకు ఉద్యోగ అవకాశాలు

విండ్ పవర్ ప్యాన్లు ఏర్పాటు అయితే దాదాపుగా 300 మంది యువతకు ఉద్యోగ అవకాశాలు దొరికే అవకాశం ఉంది... మరో వైపు విండ్ పవర్స్ నిర్వాహకుల నుంచి డబ్బులు డిమాండ్ చేసేందుకు ప్రజా ప్రతినిధులు సైతం సిద్ధం అవుతున్నారు..



ఘనంగా రెవెన్యూ దినోత్సవం


ఉత్తమ ప్రతిభ కనబరిచిన రెవెన్యూ సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేస్తున్న ఆదోని సబ్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ

ఆదోని, జూన్ 20: ప్రజలకు ప్రత్యక్షంగా సేవలు అందించడంలో రెవెన్యూశాఖ కీలకమైనదని ఆదోని సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ పేర్కొన్నారు. గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఆవరణంలో రిటైర్డ్ రెవెన్యూ అధికారులు, రైతులు, రెవెన్యూ సిబ్బంది, సబ్ కలెక్టర్ అధ్యక్షతన రెవెన్యూ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంలో ఆయన మాట్లాడుతూ బ్రిటీష్ కాలం మునుపు నుండే రెవెన్యూ శాఖ పుట్టుకొచ్చిందని, ఆనాటి నుంచి ఈనాటి వరకు ప్రతి కార్యక్రమానికి రెవెన్యూ శాఖతో ప్రతి వ్యక్తికి పుట్టుక నుంచి మరణం వరకు అనుసంధానం కలిగి ఉంటుందని వివిధ సేవలను వివరించారు. అనంతరం రెవెన్యూ శాఖలో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన ఉద్యోగులకు పదవీ విరమణ పొందిన అధికారులకు సబ్ కలెక్టర్ చేత సన్మానించి, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఏవో శేషయ్య, తహసీల్దార్ హసీనా సుల్తానా, వేణు సూర్య, ఆర్ఐ రామేశ్వర్ రెడ్డి, వలి భాష, పెద్దయ్య, దీపా, కౌసర్ భాను, వినీత్, ఈరన్న పాల్గొన్నారు.

వైభవంగా స్వర్ణ రథోత్సవం

మంత్రాలయం, జూన్ 20 : రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయులు స్వర్ణ రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. గురువారం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆశీస్సులతో తెల్లవారుజాము నుంచే స్వామి మూల బృందావనంకు విశేష పంచామృతాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు అనంతరం బంగారు,వెండి, పట్టువస్త్రాలు, బెంగళూరు నుంచి తెచ్చిన ప్రత్యేక పుష్పాలతో చూడముచ్చటగా అలంకరించారు. స్వర్ణ రథం పై వజ్రాలు పొదిగిన ప్రహ్లాదరాయులను ప్రాంగాణం చుట్టూ ఊరేంచారు.

మంత్రాలయం మఠానికి రూ.5.90 లక్షల విరాళం

రాఘవేంద్రస్వామి మఠానికి బెంగళూరుకు చెందిన వెంకటరమణ రూ.లక్ష గోశాల, నెల్లూరుకు చెందిన పరమేశ్వర రూ.లక్ష గోశాల, బెంగళూరుకు చెందిన గీతా బాపై అనే భక్తురాలు శాశ్వత సేవకు రూ.3.90 లక్షలు, విరాళంగా ఇచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషి తెలిపారు.

కరువు పరిస్థితులపై కేంద్రం స్పందించాలి

● టీడీపీ తెలుగు రైతు కమిటీ రాష్ట్ర కార్యదర్శి సీఎస్ నారాయణ రెడ్డి

ఆలూరు, జూన్ 20: గత ఏడాది నుంచి జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితుల పై కేంద్రం స్పందిం రైతులను ఆదుకోవాలని కేంద్ర కరువు బృందానికి విన్నవించినట్లు టీడీపీ తెలుగు రైతు కమిటీ రాష్ట్ర కార్యదర్శి సీఎస్ నారాయణ రెడ్డి గురువారం తెలిపారు. గత ఏడాది 2023-24 రబీ, ఖరీఫ్ సీజన్‌లో అప్పులు చేసి రైతులు పప్పు, శెనగ, పత్తి, వేరుశనగ, మిర్చి, పత్తి పంటలను సాగు చేసి, వర్షాలు రాక పంట దిగుబడి రాలేదన్నారు. బ్యాంక్‌లో రైతులు తీసుకున్న అప్పులను రీ-షెడ్యూల్ చేసి కొత్త రుణాలు ఇవ్వాలని, నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకు రూ.10వేలు ఇవ్వాలని, వెనుకబడిన ఆలూరు ప్రాంతంలో పెండింగ్‌లో ఉన్న వేదవతి, నగరడోణ ప్రాజెక్టులు పూర్తి చేయాలని ఆలూరుకు వచ్చిన కరువు కేంద్ర బృందానికి వివరించినట్లు తెలిపారు.

పొదుపు సంఘాల్లో మోసం చేస్తే చర్యలు : పీడీ

మద్దికెర, జూన్ 20: జిల్లాలోని పొదుపు సంఘాల్లో మహిళా లీడర్లు ఎవరినైనా మోసం చేసి నిధులు కాజేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని వెలుగు పీడీ సలీంబాషా హెచ్చరించారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో గ్రామైఖ్య సంఘం లీడర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పొదుపు మహిళలు జమ చేసుకున్న నిధులు దాదాపు రూ.299 కోట్లు ఉన్నాయని, ఒక్కొక్క మండలంలో మహిళా సంఘాలు రూ.13 కోట్ల వరకు ఆయా గ్రూపు సభ్యులు రుణాలు పొందవచ్చని తెలిపారు. ఒక్కొక్కరు రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు రుణం పొంది తమ కాళ్లపై నిలబడవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో కెనరా బ్యాంకు కర్నూలు ఆర్వో రఘువీర్, ఏపీఎం మధుబాబు, బ్యాంకు మేనేజర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

శ్రీనిధి నిధులు కాజేశారు

మద్దికెర, జూన్ 20: మండలంలో పొదుపు సంఘాల మహిళలకు చెందిన శ్రీనిధి నిధులను వైసీపీ ప్రభుత్వ హయాంలో శ్రీనిధి నిధులు కాజేశారని టీడీపీ జిల్లా కార్యదర్శి గూడూరు ధనుంజయుడు అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో వెలుగు పీడీ సలీంబాషాను శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ధనుంజయుడు మాట్లాడుతూ మండలంలో ఆయా గ్రామాల్లో దాదాపు రూ.50 లక్షల్లో శ్రీనిధి నిధులు కాజేశారనీ తెలిపారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని పేర్కొన్నారు. సమస్యను ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు దృష్టికి తీసుకెళ్లామన్నారు.

పంటల సాగుకు అదును దాటలేదు

● అంతర్ పంటగా కంది సాగుతో అధిక లాభం : ఏడీఏ

గోనెగండ్ల, జూన్ 20: వివిధ పంటలను సాగు చేసుకునేందుకు సమయం దాటిపోలేదని, రైతులు ఆందోళన చెందనవసరం లేదని వ్యవసాయశాఖ ఏడీఏ ఖాద్రీ, ఏవో హేమలత రైతులకు సూచించారు. గురువారం మండలంలోని పలు పంట పొలాలను వారు పరిశీలించారు. వరి పంటను సాగు చేసుకునేరైతులు 125 రోజుల కన్న తక్కువ సమయంలో పంట చేతికి అందే రకం వరి ని సాగు చేసుకోవాలని, నేరుగా విత్తు పద్ధతి పై శ్రద్ధ వహించాలని సూచించారు. జూలై నెల 20 వ తేదీ వరకు పత్తి పంటను సాగు చేసుకోవచ్చని తెలిపారు. తెలిక నెలల్లో 50-60 మి.మీ., బరువు నెలల్లో 60-75 మి, మీ, వర్షపాతం నమోదు అయిన తరువాతనే పత్తి సాగు చేసుకోవాలని, పత్తిలో అంతర్ పంటగా కందిని సాగు చేసుకోవాలని పేర్కొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి : సెబ్ సీఐ

ఎమ్మిగనూరు టౌన్, జూన్ 20 : ఎమ్మిగనూరు పట్టణంలో వైష్ణవి డిగ్రీ కళాశాలలో జరిగిన సమావేశంలో విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సెబ్ సీఐ భార్గవ్ రెడ్డి గురువారం వైష్ణవి డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సులో సెబ్ సీఐ , ప్రిన్సిపాల్ గడిగె లింగప్ప మాట్లాడుతూ యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ భవిష్యత్తుకు మంచి పునాదులు వేసుకోవాలని సూచించారు. ఎస్ఐ సత్యనారాయణ,గోపాల్,నరసింహులు, భరత్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలపై దృష్టి సారించాలి

ఎమ్మిగనూరు, జూన్20: జర్నలిస్టు సమస్యల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు నాగరాజుగౌడు కోరారు. గురువారం పట్టణంలో యూనియన్ తాలుకా అధ్యక్షుడు శ్రీనివాసనాయుడు అధ్యక్షతన జిల్లా కమిటి సమావేశం నిర్వహించారు. ఐజేయూ సభ్యులు గోరంట్ల కొండప్ప, నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగాజుగౌడు, సుంకన్న హాజరయ్యారు. నాగరాజుగౌడు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో టీడీపీ మేనిఫెస్టోలో జర్నలిస్టులకు ఇంటి స్థలాలు, గృహ నిర్మాణాలు, అర్హులైన ప్రతి జర్నలిస్టులకు అక్రిడేషన్లు, హెల్త్‌కార్డులు, జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఉచిత విద్య వంటి వాటిని అందజేస్తామని చెప్పారని, ఈ మేరకు వాటి అమలుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు హరికిషన్, అంజి, వీరేష్, స్వరూప్, ఉసేని, చంద్ర, నాగరాజు, సాలరంగడు, జి.బి పరమేశ్వర, నూర్ అహ్మద్, చిన్నాకుల నాగరాజు, దేవేంద్రరెడ్డి, జయరాజు, చాంద్‌బాషా, జాలవాడిబాషా, మక్బుల్ పాల్గొన్నారు.

నిజాయితీని చాటుకున్న పూల వ్యాపారి

● దొరికిన బంగారు గొలుసు పోలీసులకు అప్పగింత

మంత్రాలయం, జూన్ 20: దొరికిన మూడు తులాల బంగారు గొలుసును గురువారం పోలీసులకు అప్పగించి వృద్ధురాలైన ఓ పూలవ్యాపారి నిజాయితీని చాటుకున్నారు. హైదరాబాదుకు చెందిన బుచ్చయ్య, సుమతి కుటుంబంతో సహా స్థానిక ఆర్యవైశ్య సత్రంలో గదిని అద్దెకు తీసుకున్నారు. ఉదయం రాఘవేంద్రస్వామి దర్శనానికి వెళ్తుండగా.. మెడలో ఉన్న మూడు తులాల బంగారు గొలుసు పడిపోయింది. స్వామివారి దర్శనాంతరం గొలుసును లేదని తెలుసుకున్న సుమతి పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు స్టేషన్ వెళ్లింది. అప్పటికే తనకు దొరికిన బంగారు గొలుసును వృద్ధురాలు అక్కమ్మ పోలీసులకు అప్పగించింది. అక్కడే ఉన్న వృద్ధురాలు అక్కమ్మ చేతులమీదుగా గొలుసును బాధితులకు అప్పగించారు. పోలీసులు అక్కమ్మను అభినందించారు.

ఘనంగా నారా భువనేశ్వరి జన్మదిన వేడుకలు

ఆస్పరి, జూన్ 20: విశ్వవిఖ్యాత నట సార్వభౌముడు కీర్తిశేషులు నందమూరి తారక రామారావు ముద్దుబిడ్డ, సీఎం నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి జన్మదిన వేడుకలు గురువారం మండల కేంద్రం ఆస్పరి, చినహోతూర్ గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. స్థానిక గాంధీ పార్కులో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

సంక్షిప్తం

పైపులైన్‌పై కూలిపోయిన భారీ వృక్షం

ఆదోని టౌన్, జూన్ 20: బసాపురం ఎస్ఎస్ ట్యాంక్ నుంచి రాంజలా చెరువులోని ఫిల్టరేషన్ ప్లాంటుకు తాగునీరు సరఫరా అవుతున్న పెద్ద పైప్‌లైన్ పై గురువారం సాయంత్రం భారీ వృక్షం కూలింది. దీంతో పైప్ పగిలిపోయి నీటి సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మునిసిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, అధికారులు అప్రమత్తమై యుద్ధ ప్రతిపాదికన చర్యలు ప్రారంభించారు. 600ఎంఎం పైపు కావడంతో మరమ్మత్తులు చేయడానికి 36 గంటల సమయం పడుతుందని, కొన్ని వార్డులకు నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని ప్రజలు సహకరించాలని ఇన్‌చార్జి ఎంఈ వెంకటచలపతి కోరారు.

బైపాస్ అలైన్‌మెంట్ మార్చాలి

ఆదోని (అగ్రికల్చర్), జూన్ 20: పట్టణ శివారు ప్రాంతంలో జాతీయ రహదారి (బైపాస్) అలైన్మెంట్ మార్చి తమకు న్యాయం చేయాలని భూమి కోల్పోయిన బాధితులు నాగరాజు, ఆనంద్ బాబు, జగన్నాథ్, రంగస్వామి, శ్రీనివాసులు, పంపాపతి, వెంకట్ కోరారు. గురువారం నేషనల్ హైవే పనులను బాధితులు అడ్డుకొని కాంట్రాక్టర్‌తో తమకు న్యాయం జరిగే వరకూ పనులు నిలుపుదల చేయాలంటూ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా తాము నిర్మించుకున్న ఇళ్లపై, ప్లాట్లపై బైపాస్ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టిందన్నారు. కలెక్టర్‌కు, నేషనల్ హైవే అధికారులకు విన్నవించామన్నారు. తాము భూమి కోల్పోతున్నామని, పాత మాస్టర్ ప్లాన్ లేదా గతంలో సూచించిన బైపాస్ రహదారిలోని నిర్మాణం చేపట్టాలని కోరారు. అట్లా అధ్యక్షుడు ఆదినారాయణ రెడ్డి, అశోక్ పాల్గొన్నారు.

రైతులు సభ్యత్వాన్ని రెన్యువల్ చేసుకోవాలి

పత్తికొండ టౌన్, జూన్ 20: పత్తికొండ సహకార పరపతి సంఘంలో సభ్యత్వం తీసుకున్న రైతులు రెన్యువల్ చేసుకోవాలని కార్యనిర్వహణ అధికారి, యేసు ప్రవక్త తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామన్నారు. సభ్యత్వాలు యథావిధిగా కొనసాగాలంటే రైతులు పాస్‌బుక్, ఆధార్, పాన్‌కార్డు జిరాక్స్‌లను రెండు ఫోటోలతో కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

కర్నూలు నుంచి బస్సు సర్వీసులు నడపాలి

పత్తికొండ టౌన్, జూన్ 20: పత్తికొండ నుంచి కర్నూలుకు సాయంత్రం 7 గంటలకు ఆర్టీసీ బస్సు సర్వీసు ఉండేదని, అయితే ఆ బస్సు నెల రోజుల నుంచి తిప్పకపోవడంతో ప్రయాణీకులు ఆ సమయంలో ఇక్కట్లు పడుతున్నారనీ, తక్షణమే యథావిధిగా ఆ బస్సులను నడపాలని బీజేపీ అసెంబ్లీ కోకన్వీనర్ గోవర్ధన్ నాయుడు నాయకులు పూల మల్లికార్జున, బ్రహ్మయ్య తదితరులు కోరారు.

విద్యతోనే బంగారు భవిష్యత్తు

ఆలూరు రూరల్, జూన్ 20: విద్యతోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని మొలగవల్లి సర్పంచు మోహన్ రాజ్ అన్నారు. గురువారం బీసీ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, బ్యాగులను సర్పంచు పంపిణీ చేశారు. విద్యార్థులు చదువును కష్టపడి కాకుండా, ఇష్టపడి చదవాలని సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పాఠశాలల విద్యాభివృద్ధికి శ్రీకారం చుట్టారని తెలిపారు. హెచ్ఎం వెంకటరాముడు, టీడీపీ నాయకులు ఉసేని, విశ్వతేజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆమరణ నిరాహార దీక్ష చేస్తా

ఆస్పరి, జూన్ 20: జోహరాపురంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నా ఎవరూ స్పందించడం లేదని, సమస్య పరిష్కారం కోసం ఆమరణ నిరాహారదీక్షకు పూనుకుంటానని టీడీపీ మాజీ మండల కన్వీనర్ జానకిరామప్ప హెచ్చరించారు. గురువారం ఆయన ఆస్పరిలో మాట్లాడుతూ జోహరాపురం గ్రామంలో కొన్నేళ్లుగా తీవ్ర తాగునీటి సమస్య ఉందని, 2002లో ఆమరణ నిరాహార దీక్ష చేయగా, అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రూ.26లక్షలు ఆనాటి ఎంపీ కేఈ కృష్ణమూర్తి రూ.5లక్షలు మంజూరు చేసి బోర్లు వేసి, పైప్ లైన్ వేశారని, భూగర్భ జలాలు అడుగంటకు పోవడంతో పథకాలు నిర్వీర్యం అయ్యాయని తెలిపారు. గ్రామ తాగునీటి సమస్య పరిష్కారం అయ్యేంతవరకు ఆందోళనను విరమించబోమని హెచ్చరించారు.

పొగాకు వాడకంపై వ్యతిరేకంగా ర్యాలీ

ఆదోని టౌన్, జూన్ 20: పొగాకు అలవాటు చేసుకొంటే ప్రాణాలను హరించివేస్తుందని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సత్యవతి అన్నారు. పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం ప్రభుత్వ వైద్య సిబ్బంది పట్టణ ప్రధాన వ్యాధులలో పొగాకుకు వ్యతిరేకంగా ర్యాలీని నిర్వహించారు. పొగాకు అలవాటు ఉన్న వారి ఆరోగ్యం క్షీణించి కుటుంబ సభ్యులను బలి తీసుకుంటుందని హెచ్చరించారు. సైక్రియాటిస్ట్ వైద్యులు చైతన్య కుమార్, సంధ్య కుమారి, శేకున్ భాను, సిబ్బంది బాబురాజు పాల్గొన్నారు.

అందుబాటులోకి రానున్న రాంజాల చెరువు

ఆదోని టౌన్, జూన్ 20: నిండుగా ఉన్న రాంజల చెరువులోని నీటిని మునిసిపల్ సిబ్బంది గురువారం బయయటికి తోడి వేసే పనులను ప్రారంభించారు. పట్టణ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా రాంజల చెరువును వాడకంలోకి తేవాలని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధి సూచనల మేరకు ఈ పనులను చేపట్టారు. ఎస్ఎస్ ట్యాంకులో 15 రోజులకు సరిపడే నీరు మిగిలి ఉండటం, ఎల్లెల్సీ కాలువలో తాగునీటిని వదిలే వరకు పట్టణ ప్రజలకు నీటిఎద్దడి తలెత్తకుండా రాంజల చెరువును వర్షం నీటితో నింపుకోవడం కోసం చర్యలు తీసుకొంటున్నట్లు ఎంఈ వెంకటాచలపతి తెలిపారు.



పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

డ్వామా పీడీ అమర్నాథ్ రెడ్డి

ఓర్వకల్లు, జూన్ 20: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని డ్వామా పీడీ అమర్నాథ్ రెడ్డి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. మండలంలోని కాల్వబుగ్గ గురు కుల పాఠశాలలో అమర్నాథ్ రెడ్డి, ఎంపీడీవో మల్లేశ్వరి ఆధ్వర్యంలో విద్యార్థులు మొక్కలు నాటారు. అనం తరం స్టూడెంట్ కిట్లను పంపిణీ చేశారు. ఓర్వకల్లు ఆరోగ్య కేంద్రంలో టీడీపీ నాయకులు గోవిందరెడ్డి, రాంభూపాల్ రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, గంగేశ్వరరెడ్డి, ఈవోఆర్డీ సుబ్బరా యుడు మొక్కలు నాటారు. గుట్టపాడులో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, గ్రామ సర్పంచ్ మోహన్ రెడ్డి ఎలిమెంటరీ స్కూల్‌లో మొక్కలు నాటారు. సోమయాజులపల్లెలో టీడీపీ నాయకులు దేవేంద్ర, ఆకుల మహేష్, రామమద్దిలేటి, హనుమంతరావు, శ్రీరామ శ్రీనివాసరెడ్డి, నాగ మల్లేష్, సంజీవలు మొక్కలు నాటారు. హుశేనాపురంలో కాల్వబుగ్గ మాజీ చైర్మన్ చంద్రపెద్దస్వామి, కన్నమడకలలో టీడీపీ నాయకులు సుధాకర్‌రావు, బొల్లవరం వెంకటేశ్వర్లు స్కూల్‌లో మొక్కలు నాటారు. మండలంలోని 22 గ్రామ పంచాయితీల్లో 4వేల మొక్కలు నాటామని ఎంపీడీవో మల్లేశ్వరి తెలిపారు. కార్యక్రమంలో ఏపీడీ లక్ష్మన్న, కోర్సు డైరెక్టర్ నాగ ఎర్రమల, ఏపీవో కుమారసాయినాథ్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుదాం..నీటిని పొదుపు చెద్దాం..

కల్లూరు: పర్యావరణాన్ని కాపాడుకుని నీటి వనరులను పొదుపు చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కల్లూరు మండలం ఉలిందకొండ వీధుల్లో ర్యాలీ, మానవహారం నిర్వహించి ప్రజలకు అవగాహణ కల్పించారు. ఉలిందకొండ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపీడీఓ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. ఎంఈఓ శ్రీనివాసులు, జలజీవన్ మిషన్ ప్రతినిధులు, ఏపీఓ మద్దీశ్వరమ్మ, టీడీపీ నాయకులు ఈవీ.రమణ, దేవమ్మ, శ్రీకాంత్, వెంకటరమణ, సలాం పాల్గొన్నారు.



కాల్వబుగ్గలో మొక్కలు నాటుతున్న డ్వామా పీడీ



ఉలిందకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధికారులు

మైనార్టీ విద్యార్థులకు హాస్టల్ సదుపాయం

కర్నూలు(కలెక్టరేట్), జూన్ 20: జిల్లాలో ఇంటర్, డిగ్రీ బీటెక్ తదితర కోర్సులు చదువుతున్న మైనార్టీ విద్యార్థులు (బాలురు) పోస్టు మెట్రిక్ వసతి గృహాల ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి డా. సునీల్ కన్నా గురువారం తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరానికి గాను 50 మంది విద్యార్థులకు అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. వివరాలకు 9052356257 నెంబరులో సంప్రదించాలన్నారు.

నేటి నుంచి పచ్చి మిర్చి తక్కువ ధరకు అమ్మకం

కర్నూలు(అగ్రికల్చర్), జూన్ 20: కూరగాయల ధరల విషయంలో మార్కెటింగ్ శాఖ తగిన చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఇందు కోసం మార్కెటింగ్ శాఖ ఒక్కో ఏడీఎం అధికారికి రూ.5 లక్షల రివాల్వింగ్ ఫండ్‌ను అందిస్తూ నిర్ణయం తీసుకుంది. పచ్చిమిర్చిని కర్నూలు నగరంలోని సీ క్యాంపు రైతుబజారులో శుక్రవారం నుంచి తక్కువ ధరలకు అమ్ముతున్నట్లు ఎస్టేట్ అధికారి హరీష్ కుమార్, హార్టికల్చర్ అసిస్టెంట్ శివకుమార్ తెలిపారు.



DOCUMENTS MISSING

Gundala Adinarayana Son of Gundala Shankaraiah Age 64., H.No. 4/m22, Chakyapuri Colony, A Camp, Kurnool. On 18/6/2024, Between Chanakya Puri colony and Collector Office,I lost original sale deeds in plastic cover attached to the cycle vehicle, sale deed No.**2754/1987, 37/ 1971, 4778/ 1992, 1497/1993** were Disappeared within the scope of the above mentioned place . If anyone found the original documents, kindly let me know through the following phone number.

GUNDALA ADINARAYANA
PHONE: 9848173811

నేడు ఇండస్ పాఠశాలలో యోగా దినోత్సవం

కర్నూలు(కల్చరల్), జూన్ 19: పదో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం నగరంలో గుత్తిరోడ్డులోని ఇండస్ పాఠశాలలో యోగా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా కార్యనిర్వాహకుడు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.30 గంటలకు మూడు వేల మంది విద్యార్థులతో సామూహిక యోగ ప్రదర్శ నలు ఉంటాయని ఆయన తెలిపారు. ముఖ్య అతిథిగా విశ్రాంత ఐఏఎస్ అధికారి నందివెలుగు ముక్తేశ్వరరావు, గౌరవ అతిథిగా మాంటిస్సోరి విద్యాసంస్థల డైరెక్టర్ కేఎస్‌వీ రాజశేఖర్ హాజరవుతారని తెలిపారు.

● **పతంజలి సాయినాథ్ యోగ శిక్షణ కేంద్రంలో..** నగరంలోని వెంకటరమణ కాలనీలోగల లక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణ మంటపంలో పతంజలి సాయినాథ్ యోగ శిక్షణ కేంద్రంలో పదో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు శిక్షణ కేంద్రం కార్యదర్శి రేగూరి బాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 6 గంటలకు యోగా గురువు పెరుమాళ్ల దత్తయ్య ఆధ్వర్యంలో యోగా దినోత్సవం ఉంటుందని, సభ్యులతో సామూహిక సూక్ష్మ వ్యాయామాలు, ప్రాణయామం గురువు దత్తయ్య పర్య వేక్షణలో చేయిస్తారని ఆయన తెలిపారు.

యోగా డేను విజయవంతం చేయండి

సి.బెళగల్, జూన్ 20: యేగా డేను విజయవంతం చేయాలని ఎంపీడీవో శకుంతల పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. గురువారం మండల పరిష త్ కార్యాలయం సమావేశం భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, పంచాయతీ కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో యోగా డేను నిర్వహించాలన్నారు. ఈవో ఆర్డీ సందీప్, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

PUBLIC NOTICE

UNDER the instructions of my Client M/s. Shriram Finance Limited, Chennai, Branch at Kurnool , I issue the following notice to general public. My Clients intends to grant loan to **Sri Posham Siva Sankar Reddy, S/o Eswar reddy,** Resident of H.No: 1/6, Ayyalur, 1st ward, Kurnool Dist., by keeping the below mentioned of property of **Sri Posham Yeswanth Reddy, S/o Posham Siva Sankar Reddy** Resident of H.No: 1/6, Ayyalur, 1st ward, Kurnool Dist. as security by way of Registered Mortgage. As such if anyone have any claims, charges, Mortgages, Sale agreements, Court attachments, Court disputes etc., shall be informed to the address mentioned below in writing within 7 days from the date of this notice. Otherwise later objections will not bind on my client in this regard.

SCHEDULE OF THE PROPERTY

The property is residential plot bearing door no:946 in Sy.No.191/B2 and 191/B5 of B.Tandrapadu Village in a Colony called maruthi Mega Hills with inSub Registration of office of kurnool and Dist Registraion office of Kurnool and bounde as follows.: **East:** Plot 932 **West :** 30' feet road, **North:** Plot No: 945, **South:** Plot.No.947
Extent: 133.33Sq.Yards

BYREDDY VENKATA RAMANA REDDY
ADVOCATE, KURNOOL,CELL:94400 79646











